ఘనంగా రథసప్తమి వేడుకలు

పూజలు చేస్తున్న ఆలయ అధికారులు,భక్తులు

మహదేవపూర్(కాళేశ్వరం)/రేగొండ, ఫిబ్రవరి 4 : మండలంలోని కాళేశ్వరముక్తీశ్వర అనుబంధ ఆలయమైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో ఎస్ మహేశ్, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఎల్కేశ్వరం గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం, హోమం, వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ వామన్‌రావు పాల్గొన్నారు. రేగొండ మండలం కోడపటంచ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి సూర్య వాహన సేవా నిర్వహించారు. ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని సూర్య వాహన సేవపై ఆలయ మాడ వీధుల్లో తిప్పారు. అర్చకులు బుచ్చామాచార్యులు, శ్రీనివాస్, శ్రీనాథ్, ఈవో మహేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కాటారం, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న, అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఐక్య యువజన సమాఖ్య(యూవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యం పోచయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం వారు మాట్లాడారు. రేగులగూడెం, పోతులవాయి గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇండ్లు, వ్యాపార, దుకాణాల సముదాయాలు నిర్మిస్తున్నారన్నారు. వారికి అధికారులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అక్కల బాపు, దయ్యం పోచయ్య కోరారు.

డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాధాకృష్ణ, ఏరుకొండ రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాతాల రాజు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేటి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేషన్ డీలర్లను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పి నేడు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి డీలర్‌కు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీలర్లు బూడిద సురేశ్, కూనూరు జయప్రకాశ్, కృష్ణారెడ్డి, వంగా సుధాకర్, సాంబయ్య, వెంకన్న, మాడెం లచ్చన్న, అజ్మత్ పాషా, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులపై అవగాహన కలిగి ఉండాలి

గణపురం, ఫిబ్రవరి 4 : పెంపుడు జంతువులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెల్పూరు పశు వైద్యాధికారి సూరం బాలకృష్ణ అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చెల్పూర్ పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల పెంపకం వాటి ద్వారా ప్రజలకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం 'జంతు సంరక్షణ చట్టాలు.. అవగాహన' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమంత్, హెచ్ఎం అశోక్, జీపీ సిబ్బంది వేణు పాల్గొన్నారు.

షరతులతో అందరికీ అందని 'ఆత్మీయ భరోసా'


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 : జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మీయ భరోసా అందిస్తుందని ఆశించిన మహిళలకు అమల్లో పలు షరతులు విధించడంతో అర్హులు కాలేకపోయారు. మండల వ్యాప్తంగా 8వేల మంది వరకు జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. అయితే ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో 665మంది మాత్రమే ఆత్మీయ భరోసా కింద ఎంపికయ్యారు. కనీసం 20రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారు మాత్రమే అర్హులుగా నిబంధనలు విధించడంతో చాలా మంది ఈ పథకాన్ని అందుకోలేకపోయారు. వచ్చే మార్చిలోగా ఈ సంవత్సరం ముగుస్తుండడంతో రెండు రోజులుగా కూలీలు మట్టి పనికి వెళ్తున్నారు. తమను కూడా అర్హులుగా గుర్తించాలని మిగతా కూలీలు కోరుతున్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-332462

CHANGE OF NAME
I, **RKMOURYA GHANAPURAM S/o. RAMASWAMY** R/o. H.No. 20-98/A1, Jai Bheem Nagar. Thorrur municipality and Mandal. Mahabubabad district. Changed my name from **GANAPURAM RAMAKRISHNA, S/o. RAMASWAMY** to **RKMOURYA GHANAPURAM S/o RAMASWAMY** for all purposes.

CHANGE OF NAME
I, **SYEDA MAHEK, W/o. SYED SADIQ** R/o. H.No. 3-9, Madipally Village of Thorrur Mandal. Mahabubabad district. Changed my name from **THIRUNAGARI YAMUNA D/o. THIRUNAGARI VIDYASAGER,** to **SYEDA MAHEK, W/o. SYED SADIQ** for all purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

- రాత్రింబవళ్లు కొనసాగుతున్న పనులు
- పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ భూమిలో చదును చేస్తున్న డోజర్

ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలు

ములుగురూరల్, ఫిబ్రవరి 4 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిలో కొన్ని రోజులుగా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు అటు వైపుగా చూడడం లేదు. కొన్నేళ్ల క్రితం జీపీ సిబ్బందికి ఇచ్చిన ఈ భూములను జిల్లా కేంద్రంగా ములుగు అవతరించిన అనంతరం కబ్జాల పరంపర కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం రాత్రింబవళ్లు ఈ ప్రాంతంలో ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సామాన్య ప్రజలు కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కొర్రీలు పెట్టే జీపీ అధికారులు విలువైన ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలువురు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ములుగు మున్సిపాలిటీగా అవతరించడంతో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ఊపందుకున్నాయి. గత పంచాయతీ పాలకుల అండదండలతోనే ఈ నిర్మాణాలు జరుగుతున్నట్లు తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతున్నది. కలెక్టర్ అతిథి గృహానికి కూత వేటు దూరంలో ఈ నిర్మాణాలు జరుగుతుండటం విశేషం.

ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని, ని ర్మాణాలు చేసే వారికి గతంలో అప్పటి ప్రభుత్వాలు ఎ లాంటి హక్కు పత్రాలు జారీ చేశారు..? అసలు వారు అ ర్హులా..? కాదా..? అనే కోణంలో పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులు విచారణ జరిపించడంతోపాటు ఈ నిర్మాణా ల వెనుక ఉన్న అసలు సూత్రధారిపై చర్యలు తీసుకోవాలని ములుగు ప్రజలు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గణపురం, ఫిబ్రవరి 4 : మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. కొండాపూరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుట్ట వెంకటేశ్వర్లు గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబాన్ని, మాజీ ఎంపీటీసీ మామిడి సారయ్య సతీమణి సరోజన మంగళవారం అనారోగ్యంతో మరణించగా సారయ్యను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌పీ లక్ష్మీనర్సింహారావు, రామంచ భద్రయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతుల పరామర్శ

రేగొండ : నాగుర్లపల్లె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఏనుగు భూపతిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పరామర్శించారు. ఆయనకు వారు మనోధైర్యం కల్పించారు.

'తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

గోవిందరావుపేట, ఫిబ్రవరి 4 : ఇటీవల వరంగల్‌లో జరిగిన బీసీ గర్జన సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ బీసీ వాళ్లను సపోర్టు చేస్తూ మిగతా కులాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దూషించాడని, ఇది సరికాదని రెడ్డిసంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సూదిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెడ్డి కులస్తులు ఎప్పటికి బీసీ కులాలకు వ్యతిరేకం కాదన్నారు. తీన్మార్ మల్లన్న కేవలం మీడియా పరంగా హైలెట్ అవడం కోసం మిగతా కులాలను తిట్టడం సరైన పద్ధతి కాదని, రెడ్డి బిడ్డలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కానీ ఇతర రెడ్డి మంత్రులు కానీ స్పందించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మల్లన్న బ్లాక్‌మెయిల్ చేసి సంపాదించింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. రెడ్డీలకు క్షమాపణ చెప్పకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డిలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 : స్వయం ఉపాధిలో శిక్షణ పొందిన యువతీయువకులు, నిరుద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్‌కుమార్ శ్రీ వాస్తవ కోరారు. స్థానిక సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో డ్రైవింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగిసి పోవడంతో మంగళవారం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్ మాట్లాడారు. ఏఎస్సీ శివం ఉపాధ్యాయ, సెకండ్ ఇన్ కమాండెంట్ పంచంలాల్, డిప్యూటీ కమాండెంట్ ఎన్‌పీ. రజిత, అసిస్టెంట్ కమాండెంట్లు నారాయణ్ తుకారం, మాగంటి శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దిన్ పాల్గొన్నారు.

ఏంజెల్ సేవింగ్స్ ఖాతాతో లబ్ధిపొందాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 : కెనరా ఏంజెల్ ఉమెన్స్ స్పెసిఫిక్ సేవింగ్స్ ఖాతాను తెరిచి లబ్ధిపొందాలని కెనరాబ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ కోరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఖాతాపై అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఖాతాలో క్యాన్సర్ బీమా, లాకర్‌పై మహిళలకు రాయితీ, వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యాలను బ్యాంకు కల్పించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతిమా, శేఖర్, సంపత్, రమేశ్, జీవవేణి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

చిట్యాల ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ జరుగనున్నట్లు ప్రిన్సిపాల్ రాజు ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేశ్ ఆదేశాల మేరకు ఈనెల 7, 8 తేదీల్లో యువకులకు వాలీబాల్, గ్రూప్ రన్నింగ్, షటిల్(సింగిల్స్), యువతులకు కబడ్డీ గ్రూప్, రన్నింగ్, షటిల్(సింగిల్స్) పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు అధ్యాపకులు గొల్లపల్లి రాజు 9951580224, నోముల వేణు 7815972223ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ రాజు సూచించారు.

నేడు వాహనాల వేలం

కాటారం, ఫిబ్రవరి 4 : కాటారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ సంఘటనలో పట్టుబడి సీజ్ చేసిన పలు వాహనాలకు బుధవారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై కిష్టయ్య తెలిపారు. ముందుగా 50 శాతం ధరావతు చెల్లించి వాహనం పొందిన తర్వాత అదేరోజు మిగతా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో వాహనాలు పొందిన వారు జీఎస్‌టీ కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్ష ఫీజు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 4 : ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, టెన్త్ వార్షిక పరీక్షల ఫీజు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు పేపరుకు రూ.50 ఆలస్య రుసుముతో ఫిబ్రవరి 10, తత్కాల్ కింద ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. ఇంత వరకు ఫీజు చెల్లించని అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

రిజిస్టర్లు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వాజేడు, ఫిబ్రవరి 4 : వైద్యులు, సిబ్బంది నిత్యం పీహెచ్‌సీకి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్ సూచించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం కలెక్టర్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు అందుబాటులో లేకుండా విధులపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆది వారం జరిగిన ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని వైద్యాధికారి, సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో కాన్పు అయిన తల్లీబిడ్డ ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెలసరి ఆశా డే సమావేశంలో పాల్గొని వైద్యసిబ్బంది, ఆశ కర్యకర్తలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కొమురం మహేందర్, హెల్త్‌సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ

ములుగురూరల్, ఫిబ్రవరి 4 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ సహకారంతో కళాశాల కెరీర్ గైడెన్స్‌సెల్ కన్వీనర్ డీ రాధిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పోటీ పరీక్షలకు మంగళవారం మెటీరియల్ అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు పూర్తిస్థాయి గైడెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అకాడమికి చెందిన శిక్షణ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ డీ మహిత మాట్లాడుతూ తాను ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం సాధించినప్పుటికీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బీ బాలయ్య, అకాడమి కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ భాస్కర్, టిఎస్కేసి కన్వీనర్ డాక్టర్ ఎస్ కవిత, అధ్యాపకులు సరిత, శిరీష, అనిల్‌కుమార్, జగదీశ్, ఉదయశ్రీ, విజిత, తేజోలత, మౌలానా, అనిత, నవీన్, ఐలయ్య, లక్ష్మీ, షరిఫా, రమేశ్ పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి శాపంగా కేంద్ర బడ్జెట్

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తిరోగమనంగా ఉందని, దేశ అభివృద్ధికి శాపంగా మారనున్నదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా , డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కారల్ మార్క్స్‌కాలనీలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ మధ్య తరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. ప్రమాదకరమైన విధానాలు అమలు చేసేందుకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని బీజేపీ మరోసారి మోసగించిందని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్, సీఐటీయూ జిల్లా నాయకులు రవికుమార్, క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాలెం చిన్న రాజేందర్, జిల్లా నాయకులు గట్టు శంకర్, బొడ్డు సునీత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 : సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతుకల మహా సాంస్కృతిక కార్యక్రమానికి చిందు హక్కుల పోరాట సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నదన్నారు. అలాగే చిందు కులస్తులను ఎస్సీ-ఏలో చేర్చి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాట్లాడుతూ సభకు టీఎస్ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. సమావేశాల్లో నాయకులు గడ్డం తిరుపతి, గడ్డం శరత్, చిరంజీవి, రమేశ్, పున్న చందర్, నీలకంఠం, వైకుంఠం, శంకర్, హరీశ్, మహేశ్, దేవరాజ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

కాటారం, ఫిబ్రవరి 4 : రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య ఏర్పడకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గ్రామాల్లోని నీటి ట్యాంకులు, చేతిపంపులు, నీటి సరఫరా చేసే మోటార్లను పరిశీలించారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందించారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రణాళిక తయారు చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎంపీవో వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో కూలిన ఇల్లు

మంగపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఇల్లెందుల రామక్కకు చెందిన ఇల్లు మంగళవారం కూలిపోయింది. కొద్దిరోజుల క్రితమే ఇంటి మొగరాలు, గోడలు శిథిల దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ఇల్లు కూలడంతో ఇంట్లోని వస్తు సామగ్రి ధ్వంసమై రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఇల్లు కూలిన సమయంలో లోపల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసింది.

అడవికి నిప్పు.. ప్రకృతికి ముప్పు..

వాజేడు, ఫిబ్రవరి 4 : అడవికి నిప్పు పెడితే ప్రకృతికి ముప్పు వాటిల్లుతుందని కృష్ణాపురం సెక్షన్ ఆఫీసర్ నారాయణ అన్నారు. మండలంలోని కృష్ణాపురం అటవీశాఖ సెక్షన్ పరిధిలోని టేకులగూడెం గ్రామంలో మంగళవారం అడవికి నిప్పు పెడితే జరిగే నష్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు పున్నమయ్య, ప్రసాదరావు, బేస్ క్యాంపు సిబ్బంది దామోదర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు

ములుగురూరల్, ఫిబ్రవరి 4 : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. ఆశ డే సందర్భంగా ములుగు మండలం రాయినిగూడెం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో ఆయన ములుగులో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశలు ఇంటి సందర్శనలో ప్రజలకు ఆరోగ్య సూత్రాలు తెలుపాలన్నారు. సమావేశంలో వైద్యులు పవన్‌కుమార్, ప్రసాద్, నాగ అన్వేశ్, డెమో సంపత్, సిబ్బంది సంపత్‌రావు, సురేశ్‌బాబు, భూపాల్‌రెడ్డి, దేవేందర్, నిర్మల, మేరి, దేవమ్మ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు

ఐలాపూర్ జాతరకు బస్సు సర్వీసులు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 4 : ఐలాపూర్‌లో ఈ నెల 12 నుంచి సమ్మక్క-సారలమ్మల జాతర జరుగుతుండటంతో భక్తుల రవాణాసౌకర్యార్థం ప్రత్యేక బస్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ వరంగల్ డిపో జీఎం విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 16వరకు హనుమకొండ నుంచి మినీ మేడారం జాతరకు 100ప్రత్యేక బస్ సర్వీస్‌లు ప్రారంభిస్తుండటంతో అందులో నుంచి ఆరు బస్సులను మేడారం నుంచి వయా ఊరట్టం కొండాయి మీదుగా మూడు బస్సులు, మరో మూడు వయా చిన్నబోయినపల్లి కొండాయి మీదుగా ఐలాపూర్ జాతరకు తిరుగుతాయని తెలిపారు. గుడి పూజారుల సంఘం తరపున హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభివృద్ధికి సహకరించడం అభినందనీయం

వాజేడు, ఫిబ్రవరి 4 : ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఓలమ్‌ఫూడ్ ఇంగ్రిడియన్స్ సహకారంతో పనిచేసే చైల్డ్‌ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రె